


WWW.VIJAYAKERATAM.COM RNI: APTEL/2010/34724

# విజయకెరటం

తెలుగు దినపత్రిక

నిజం మా ధ్యేయం - ప్రజలే మా లక్ష్యం

VIJAYA KERATAM TELUGU DAILY




సెప్టెంబర్ 4 శుక్రవారం 2026 | సంపుటి : 18 | సంచిక : 212 | పేజీలు : 4 | వెల రూ. 2.00/- | ఎడిటర్ : యం.డి.మక్సూద్ అహ్మద్

FRIDAY SEPTEMBER 4 2026 | VOL:18 | ISSUE: 212 | PAGES:4 | Rs. 2:00 | EDITOR:MD. MaKsood Ahmed

## కొండా సురేఖ బర్తరఫ్.. రేవంత్ రెడ్డిని శపించిన ఆమె కుమార్తె సుస్మిత

**తెలంగాణ కేబినెట్ నుంచి మంత్రి కొండా సురేఖ తొలగింపు**

**పరకాల నుంచి పోటీ చేయాలంటూ ముఖ్యమంత్రికి సవాల్**

**తన తల్లికి అన్యాయం జరిగిందని సుస్మిత ఆవేదన**



తెలంగాణ మంత్రివర్గం నుంచి కొండా సురేఖను

(మిగతా 2వ పేజీలో..)

## కొండా సురేఖ సంచలన ఆరోపణలు చేశారు

**హైదరాబాద్: సెప్టెంబర్ 3 విజయకేరటం ప్రతినిధి**

తనను మంత్రి పదవి నుంచి తొలగించడంపై మాజీ మంత్రి కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేశారు. తనను తొలగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధిష్ఠానంపై ఒత్తిడి తెచ్చారని ఆమె ఆరోపించారు. "సురేఖను మంత్రి పదవి నుంచి తీసేయకపోతే నేను వెళ్లిపోతాను అని రేవంత్ రెడ్డి బ్లాక్‌మెయిల్ చేశారు. అందుకే నన్ను మంత్రి పదవి నుంచి తొలగించారు. కానీ నన్ను తొలగించే ఆలోచన అధిష్ఠానానికి లేదు" అని కొండా సురేఖ పేర్కొన్నారు. తనను కావాలనే టార్గెట్ చేశారని ఆరోపించిన ఆమె.. రేవంత్ రెడ్డి బ్రదర్స్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వేం నరేందర్ రెడ్డి, మాజీ టీడీపీ నాయకులు అందరూ కలిసి తనపై కుట్ర చేశారని వ్యాఖ్యానించారు. "నన్ను కనీసం



(మిగతా 2వ పేజీలో..)

# రైతన్నల కోసం పాదయాత్ర చేస్తా: కేటీఆర్

**మిర్యాలగూడ సెప్టెంబర్ 3 విజయకేరటం ప్రతినిధి**

**సెప్టెంబర్ 14లోపు సాగర్ ఎడమ కాలువకు నీటి విడుదల షెడ్యూల్ ఇవ్వాలి**

**లేకుంటే వేలాది మంది రైతులతో కోదాడ నుంచి హాలియా వరకు పాదయాత్ర**

**2003లో కేసీఆర్ పోరాట స్ఫూర్తితో మరో ఉద్యమానికి సిద్ధం**

రైతన్నల పంటలను కాపాడేందుకు మరోసారి పోరాటానికి సిద్ధమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద రైతుల పంటలు ఎండిపోతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం నీటిని విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. సెప్టెంబర్ 14లోపు ఎడమ కాలువకు నీటిని ఎప్పుడు, ఎంత మేరకు విడుదల చేస్తారో స్పష్టమైన షెడ్యూల్ ప్రకటించాలని ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చారు. గడువులోగా స్పందించకపోతే వేలాది మంది రైతులతో కలిసి కోదాడ నుంచి హాలియా వరకు స్వయంగా పాదయాత్ర చేపడతానని ప్రకటించారు.

(మిగతా 2వ పేజీలో..)



## మోదీని అడిగే దమ్ముందా?.. తెలంగాణ బీజేపీ నేతలకు పొన్నం సవాల్

**మోదీని కలిసి తెలంగాణ హక్కులు అడగాలని సూచన**

**కేంద్ర నిధులు, ప్రాజెక్టులపై ప్రశ్నించాలని డిమాండ్**

**తెలంగాణకు నిధుల విషయంలో అన్యాయం జరుగుతోందని ఆరోపణ**

**మెట్రో, నవోదయ, కేంద్రీయ పాఠశాలల అంశాలు ప్రస్తావన**

ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వాలని డిమాండ్

తెలంగాణలో బీజేపీ నేతలు తమ పార్టీలోని అంతర్గత విభేదాలను కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మంత్రి పొన్నం



(మిగతా 2వ పేజీలో..)

## అక్టోబర్ నెలలోనే స్థానిక ఎన్నికలు, కొత్త పింఛన్లు: నారా లోకేశ్

**రాష్ట్ర మంత్రులతో సమావేశమైన నారా లోకేశ్**

**స్థానిక ఎన్నికలను వాయిదా వేసే ప్రసక్తి లేదని వెల్లడి**

**ఈ ఎన్నికలను వాయిదా వేయించేందుకు వైసీపీ కుట్రలు పన్నుతోందని విమర్శ**

రాష్ట్ర మంత్రులతో విద్యాశాఖ మంత్రి ఈరోజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కూటమి పార్టీల యంత్రాంగాన్ని సంపూర్ణంగా సన్నద్ధం చేయడం, కొత్త పింఛన్ల పంపిణీ ప్రక్రియతో పాటు శాఖాపరమైన పనితీరుపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ అక్టోబర్ నెల నుంచి దశలవారీగా కొత్త పింఛన్లు అందజేయాలని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. అందిన ప్రతి దరఖాస్తును ఎప్పటికప్పుడు



(మిగతా 2వ పేజీలో..)

## మద్రాస్ హైకోర్టులో స్టాలిన్‌కు ఎదురుదెబ్బ

**కొలత్తూర్ నియోజకవర్గంలో ఓటమిపాలైన స్టాలిన్**

**ఈవీఎంలు, వీవీపాట్‌లలో అక్రమాలు జరిగాయంటూ పిటిషన్**

**పిటిషన్ విచారణార్హం కాదన్న ధర్మాసనం**

తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎం.కే. స్టాలిన్‌కు మద్రాస్ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తన సొంత నియోజకవర్గమైన కొలత్తూర్‌లో ఎదురైన ఓటమిని సవాలు చేస్తూ... ఈవీఎంలు, వీవీపాట్ స్లిప్పుల రీ-కౌంటింగ్ నిర్వహించి ప్రత్యర్థి విజయాన్ని రద్దు చేయాలని ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన హైకోర్టు, అది విచారణార్హం కాదంటూ

(మిగతా 2వ పేజీలో..)



## ముఖ్యమంత్రి పర్యటన శంకుస్థాపన కార్యక్రమాలు పరిశీలిస్తున్న కలెక్టర్



**నకిరేకల్ సెప్టెంబర్ 3 విజయ కెరటం ప్రతినిధి**

రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నకిరేకల్ పర్యటన ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి .చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. గురువారం అయన నకిరేకల్ పట్టణంలో ముఖ్యమంత్రి రాక ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈనెల 5న రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి నకిరేకల్ పట్టణం లో నూతనంగా నిర్మించిన ప్రాంతీయ వైద్యశాలను ప్రారంభించనున్నారు. అంతేకాక యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల, తెలంగాణ పబ్లిక్ స్కూల్, ఇంటిగ్రేటెడ్ మండల్ ఆఫీస్ కాంప్లెక్స్,




అలాగే వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు.ప్రాంతీయ వైద్యశాలలో ప్రారంభోత్సవ ఏర్పాట్లను, శిలాఫలకం ఏర్పాటు చేయాలని, ఆస్పత్రి ఆవరణ మొత్తం పరిశుభ్రంగా ఉంచాలని, ఆస్పత్రిలో లైటింగ్ తో పాటు, పూలతో

## అధికారిక కార్యక్రమాలు, ప్రారంభోత్సవ ప్రకటనల్లో మంత్రుల ఫొటోలు లేకపోవడం సరికాదు: చంద్రబాబు

**వెలిగొండ, పోలవరం ఎడమ కాలువ ప్రకటనల్లో కనిపించని మంత్రి నిమ్మల ఫొటో**

**నిమ్మల ఫొటోను ముద్రించకపోవడాన్ని తప్పుబట్టిన చంద్రబాబు**

**భవిష్యత్తులో ఇలాంటి తప్పులు పునరావృతం కాకూడదని ఆదేశం**

ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలు, ప్రారంభోత్సవ ప్రకటనల్లో ప్రొటోకాల్ ఉల్లంఘనలు చోటుచేసుకోవడంపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వానికి సంబంధించిన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ ప్రకటనల్లో సంబంధిత శాఖ మంత్రుల ఫొటోలు లేకపోవడం తీవ్రమైన పొరపాటని, ఇది ఏమాత్రం సరికాదని స్పష్టం చేశారు. ముఖ్యంగా వెలిగొండ, పోలవరం ఎడమ కాలువ ప్రకటనల్లో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల



(మిగతా 4వ పేజీలో..)

విజయకెరటం
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# జెన్‌జీని మోదీ ప్రభుత్వం ఆకట్టుకోగలదా?

'నిలదొక్కుకోవాలంటే తడబడడం అవసరం' అని ఒక కవి అన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అలాంటి పరిస్థితుల్లో ఉన్నట్లు కనిపిస్తోంది. జూలై 20--25 తేదీల మధ్య దేశవ్యాప్తంగా జరిగిన విద్యార్థుల నిరసనల్లో పాల్గొన్నవారిపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించాలని, తదుపరి దర్యాప్తు చేయరాదని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. దీంతో సెప్టెంబర్ 5న ఢిల్లీలో జరగాల్సిన మరో నిరసన సమసిపోయినట్లు కనిపిస్తోంది. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో ఢిల్లీలో జరగాల్సిన బ్రిక్స్ సమ్మిట్ నేపథ్యంలో శాంతిభద్రతలు కాపాడాలని ప్రభుత్వం భావించి సామరస్య వైఖరి అవలంబించినట్లు అనిపిస్తోంది.ఎఫ్ఐఆర్‌లు రద్దు చేస్తామని, నీట్ పేపర్ లీక్‌లతో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లిస్తామని సీజేపీ ప్రతినిధులతో ఒప్పందం కుదిరినా, చర్యలు ఆలస్యం కావడంతో ఉపాధ్యాయుల దినోత్సవం రోజున ఇండియా గేట్ నుంచి ఢిల్లీ పోలీసు హెడ్‌క్వార్టర్స్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహిస్తామని సీజేపీ ప్రకటించింది. దీంతో ఢిల్లీ పోలీసులు సెక్షన్ 163 కింద అనుమతి లేని సమావేశాలను నిషేధించారు. ఈ నిరసనపై నిషేధం కోరుతూ రిటైర్డ్ పోలీసు అధికారి ద్వారా సుప్రీంకోర్టులో పిటిషన్ కూడా దాఖలైంది. సాధారణంగా పెద్ద ఎత్తున బలగాలను తరలించి నిరసనలను నియంత్రించే సామర్థ్యం ప్రభుత్వానికి ఉంది. అయితే అంతర్జాతీయ శిఖరాగ్ర సదస్సు సమయంలో హింసాకాండ జరిగితే విదేశీ ప్రతినిధులకు అసౌకర్యం కలుగుతుందని, అంతర్జాతీయ ప్రతిష్ఠ దెబ్బతింటుందని ఆందోళనతో ప్రభుత్వం పట్టువిడుపు వైఖరి చూపినట్లు కనిపిస్తోంది. నిరసనను నిషేధించే ప్రసక్తి లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసిన తర్వాతే ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించాలని కేంద్రం, ఢిల్లీ పోలీసులు దరఖాస్తు చేశారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టులో విద్యార్థులపై కేసులు ఉపసంహరిస్తామని, ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు మూడు నెలల్లోగా నష్టపరిహారం చెల్లిస్తామని విన్నవించారు. దీంతో ఆర్టికల్ 142 కింద సుప్రీంకోర్టు ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించాలని ఆదేశించడం, సీజేపీ నిరసనను ఉపసంహరించుకోవడంతో పరిస్థితులు సద్దుమణిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే జూన్--జూలై నిరసనల ప్రకంపనలు ఇంకా కొనసాగుతున్నాయి. సీజేపీ దేశవ్యాప్తంగా స్కూళ్ల మౌలిక సదుపాయాలు, ప్రశ్నపత్రాల లీక్‌లు, పరీక్షల నిర్వహణ లోపాలు, టీచర్ల ఖాళీలు, నిరుద్యోగం, పెట్రోల్‌లో ఇథనాల్ కలపడం వంటి సమస్యలపై ఆందోళనలు నిర్వహిస్తోంది. 'స్కూల్ ఠీక్ కరో', 'క్యాబోల్తీ హై పబ్లిక్' వంటి కార్యక్రమాలు చేపట్టింది. తీవ్ర ఒత్తిడి వస్తే తప్ప వైఖరి మార్చుకునే ధోరణి ప్రభుత్వంలో కనిపిస్తోందని విమర్శలు ఉన్నాయి. విద్యార్థుల ఆందోళన తారస్థాయికి చేరాకే విద్యామంత్రి రాజీనామా, ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణ జరిగాయి. సమస్యలను ముందుగా అంచనా వేసి పరిష్కరించడంలో లోపాలు ఉన్నాయని, కేవలం బల ప్రయోగంపైనే ఆధారపడటం సమస్య అని కొందరు అభిప్రాయపడుతున్నారు.పన్నెండు సంవత్సరాల పాలన తర్వాత విద్యార్థుల నుంచి ప్రతిఘటన ఎదుర్కోవాల్సి రావడం గమనార్హం. కొత్త తరం ప్రతి నిర్ణయాన్నీ ప్రశ్నిస్తోంది. వ్యవస్థల్లో లోపాలను ఎత్తిచూపుతోంది. సామాజిక మాధ్యమాల ద్వారా వివిధ శక్తులు కలిసి కదలికలు చేస్తున్నాయి. కులం, మతం, ప్రాంతం వంటి సాంప్రదాయ గుర్తింపులను అధిగమించి కొత్త గుర్తింపుతో ముందుకు వస్తోందని చెప్పవచ్చు.ఈ తరం విద్య, నిరుద్యోగం, జవాబుదారీతనం, పారదర్శకత, నిజాయితీని ఆశిస్తోంది. కేవలం గత పాలనల విమర్శలు, మత రాజకీయాలు వారికి సరిపోకపోవచ్చు. అందువల్ల వారి భవిష్యత్తును మెరుగుపరిచేందుకు ఏమి చేయాలన్నదే ప్రస్తుత సవాలు. రాజీవ్ గాంధీ 1988లో 18 ఏళ్ల నిండిన వారికి ఓటు హక్కు కల్పించారు. అయినా 1989లో యువత ఆయన ప్రభుత్వాన్ని తిప్పికొట్టింది. బోఫోర్స్, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం వంటి కారణాలు ఉన్నాయి. కొత్త తరం మనసును అర్థం చేసుకుని, వారి సమస్యలపై స్పందించడం అవసరం. టైమ్ పాస్ రాజకీయాలను వదిలి యువత సమస్యలపై పని చేస్తేనే రాజకీయ పార్టీల మనుగడ సాగే అవకాశం ఉంది. లేని పక్షం లో యువత పెద్ద ఎత్తున ఉద్యమించి దేశ రాజకీయాలను తలకిందులు చేస్తాయి అనడం లో సందేహం లేదు.

**- సమీ, సీనియర్ జర్నలిస్ట్.**

# రైతన్నల కోసం పాదయాత్ర చేస్తా: కేటీఆర్

మొదటి పేజీ తరువాయి)

మిర్యాలగూడ రైతు మహాధర్నాలో మాట్లాడిన కేటీఆర్.. సాగర్‌లో ప్రస్తుతం 180 టీఎంసీల నీరు ఉన్నప్పటికీ ఎడమ కాలువ రైతులకు చుక్క నీరు ఇవ్వకపోవడం దారుణమన్నారు. నీళ్లు లేక కాదు.. రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకే ఈ పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ఈ సీజన్‌లో నీటిని విడుదల చేసే అవకాశం పూర్తిగా ఉన్నప్పటికీ ప్రభుత్వం కావాలనే నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు.కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ వ్యవసాయ రంగం దేశానికే ఆదర్శంగా నిలిచిందని కేటీఆర్ గుర్తుచేశారు. తెలంగాణ అన్నపూర్ణగా, ధాన్య భాండాగారంగా మారిందని చెప్పారు. ముఖ్యంగా ఉమ్మడి నల్గొండ జిల్లా వరి ఉత్పత్తిలో అగ్రస్థానంలో నిలిచిందని, తెలంగాణ రైస్‌బౌల్‌గా పేరుగాంచిన మిర్యాలగూడ పచ్చని మాగాణాలతో కళకళలాడిందని తెలిపారు. కానీ నేడు అదే ప్రాంతంలో రైతులు తమ పంటలకు నీళ్లు కావాలని ధర్నాలు చేయాల్సిన పరిస్థితి రావడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు.మిర్యాలగూడ మాత్రమే కాకుండా హుజూర్‌నగర్, నాగార్జునసాగర్, కోదాడ, సూర్యాపేట, నల్లగొండ, నకిరేకల్ సహా సాగర్ ఎడమ కాలువ కింద ఉన్న రైతాంగం తీవ్ర ఆందోళనలో ఉందన్నారు. కేసీఆర్ పాలనలో ధీమాగా వ్యవసాయం చేసిన రైతులు నేడు పంటలు ఎండిపోతుంటే నీళ్లు వస్తాయో రావో తెలియని పరిస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఎన్నికలకు ముందు రైతు డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చిందని కేటీఆర్ గుర్తుచేశారు. రెండు లక్షల రుణమాఫీ, రైతులకు పెరిగిన ఆర్థిక సాయం, కౌలు రైతులకు మద్దతు, పంటలకు బోనస్ వంటి హామీలతో అధికారంలోకి వచ్చి ఇప్పుడు వాటిని విస్మరించిందని ఆరోపించారు. అడ్డగోలుగా హామీలు ఇచ్చి రైతులను మభ్యపెట్టారని మండిపడ్డారు.రైతులు కాంగ్రెస్‌ను నమ్మి ఓటేస్తే నేడు మోసపోయామని భావించే పరిస్థితి వచ్చిందని అన్నారు. రైతులకు ఇచ్చిన హామీలు ఎంతవరకు అమలయ్యాయో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం వారి కళ్ల ముందే పంటలు ఎండిపోతున్నా స్పందించడం లేదని విమర్శించారు.సాగర్ ఎడమ కాలువ రైతుల సమస్య కోసం 2003లో కేసీఆర్ చేపట్టిన కోదాడ-హాలియా పాదయాత్రను కేటీఆర్ గుర్తుచేశారు. అప్పటి ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకువచ్చి రైతులకు నీరు విడుదల చేయించడంలో కేసీఆర్ విజయం సాధించారని చెప్పారు. అదే పోరాట స్ఫూర్తితో ఇప్పుడు మరోసారి రైతుల కోసం పాదయాత్రకు సిద్ధమవుతున్నట్లు ప్రకటించారు."సెప్టెంబర్ 14లోపు ఎడమ కాలువకు నీటిని ఎప్పుడు విడుదల చేస్తారు? ఎన్ని తడులకు నీళ్లు ఇస్తారు? ఎంత మేరకు నీరు అందిస్తారు? అనే విషయాలపై స్పష్టమైన షెడ్యూల్ ప్రకటించాలి. లేకుంటే వేలాది మంది రైతులతో కలిసి కోదాడ నుంచి హాలియా వరకు నేనే స్వయంగా పాదయాత్ర చేస్తా" అని కేటీఆర్ స్పష్టం చేశారు.నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో సాగర్ ఆయకట్టు రైతులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని అన్నారు. జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రులు, నీటిపారుదల శాఖ రైతుల ఆవేదనను అర్థం చేసుకుని వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. రైతులను అనిశ్చితిలో ఉంచకుండా పంటలను కాపాడేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులకు అండగా కేసీఆర్ ఉన్నారని, బీఆర్ఎస్ మొత్తం రైతాంగం పక్షాన నిలుస్తుందని కేటీఆర్ భరోసా ఇచ్చారు. అసెంబ్లీలోనూ రైతుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని, అక్కడ సమాధానం రాకపోతే ప్రజాక్షేత్రంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. "రైతుల కళ్ల ముందే పంటలు ఎండిపోతుంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదు. నీళ్లు విడుదల చేసి రైతులను ఆదుకోవాలి. ప్రభుత్వం స్పందించకపోతే కేసీఆర్ స్ఫూర్తితో రైతన్నలతో కలిసి పాదయాత్ర చేసి వారి హక్కుల కోసం పోరాడతాం" అని కేటీఆర్ తేల్చిచెప్పారు.



## ముఖ్యమంత్రి పర్యటన శంకుస్థాపన కార్యక్రమాలు పరిశీలిస్తున్న కలెక్టర్





మొదటి పేజీ తరువాయి)

డెకరేషన్ చేయించాలని, బిల్డింగ్ మొత్తాన్ని ఆటోమేటిక్ బల్బుల ద్వారా విద్యుత్ దీపాలతో అలంకరించాలని కలెక్టర్ ఆదేశించారు. అంతేకాక రాష్ట్ర ముఖ్యమంత్రి ఆస్పత్రిలో ప్రారంభించే వివిధ విభాగాలను కూడా సిద్ధం చేసి ఉంచాలని ,సూపరింటీండెంట్ గది తో పాటు, ఆస్పత్రిలోని అన్ని విభాగాలు, టాయిలెట్లు, లిఫ్ట్, ఆపరేషన్ థియేటర్లు ,వార్డులు, ప్రతీ విభాగాన్ని ముందే శుభ్రపరచి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆస్పత్రిలో స్టాండ్ బై జనరేటర్ కూడా సిద్ధంగా ఉంచాలని డిసిహెచ్ఎస్ మాతృ నాయక్, సూపరింటెండెంట్ శోభ రాణిలను ఆదేశించారు. అనంతరం పక్కనే ఉన్న స్టేడియం గ్రౌండ్లో ఏర్పాటు చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరుకానున్న బహిరంగ సభ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పర్యవేక్షించారు. సభా వేదిక ,వాహనాల పార్కింగ్ ,వివిధ అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు ఏర్పాటు చేసే శిలాఫలకాలు, బ్యారికేడింగ్, బహిరంగ సభ కు హాజరయ్యే ప్రజా ప్రతినిధులు , అధికారులు, ప్రజలకు అవసరమైన ఏర్పాట్లు, కుర్చీలు, టెంట్లు, తాగునీరు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తిచేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.ఆ తర్వాత జిల్లా కలెక్టర్ వివిఎం పాఠశాల గ్రౌండ్లో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ ఏర్పాట్లను కూడా పరిశీలించారు. సాధ్యమైనంత త్వరగా హెలిప్యాడ్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. వివి ఎం పాఠశాల గ్రౌండ్లో డబుల్ బ్యారికెడింగ్ తో పాటు ,లైటింగ్, గ్రీన్ రూమ్ ఏర్పాట్లను చేయాలని, ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఆదేశించారు. స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ మాతృనాయక్, ఆర్ అండ్ బి ఎస్ ఈ పున్నమోహన్, ఈఈ శ్రీధర్ రెడ్డి ,మున్సిపల్ కమిషనర్ సతీష్, తహసిల్దార్ యశ్వంత్, పోలీసు, రెవెన్యూ, ఫైర్, ఎక్సైజ్, శాఖల అధికారులు ,తదితరులు ఉన్నారు

# కొండా సురేఖ బర్తరఫ్.. రేవంత్ రెడ్డిని శపించిన ఆమె కుమార్తె సుస్మిత

మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బర్తరఫ్ చేయడం రాజకీయంగా పెను సంచలనం సృష్టించింది. ఈ నిర్ణయంపై సురేఖ కుమార్తె సుస్మిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన తల్లికి అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆమె శాపనార్థాలు పెట్టారు.తల్లి బర్తరఫ్‌పై స్పందించిన సుస్మిత "నా తల్లికి అన్యాయం జరిగింది. ఆమె పట్ల అనుసరించిన తీరు నన్ను తీవ్రంగా బాధించింది. మా అమ్మ గొంతును ఎవరూ నొక్కలేరు. నేను రేవంత్ రెడ్డిని శపిస్తున్నాను" అని వ్యాఖ్యానించారు. అంతేకాకుండా, "నా తల్లి ప్రాతినిధ్యం వహిస్తున్న పరకాల నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని రేవంత్ రెడ్డికి సవాల్ విసురుతున్నాను" అని పేర్కొన్నారు. గతంలో తాను చేసిన వ్యాఖ్యలు కేవలం వ్యక్తిగత హోదాలో ఒక వ్యక్తిని ఉద్దేశించినవే తప్ప, ఏ పార్టీకి వ్యతిరేకం కాదని ఆమె స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడికి సంబంధించిన ఓ షెల్ కంపెనీకి తక్కువ ధరకు విలువైన భూములను కేటాయించారని సుస్మిత చేసిన ఆరోపణలతో ఈ వివాదం మొదలైంది. దీనికి తోడు, టికెట్ల కేటాయింపులో నగదు ప్రమేయం ఉందంటూ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలు ఈ దుమారాన్ని మరింత పెంచాయి.ఈ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్ఠానం జోక్యం చేసుకుని, కొండా సురేఖ తొలగింపునకు ఆమోదం తెలిపింది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించడంతో పాటు, చిన్నారెడ్డి నియామకాన్ని కూడా రద్దు చేశారు. ఈ మేరకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు సిఫార్సులు పంపారు. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలతో తనకు ఎటువంటి సంబంధం లేదని కొండా సురేఖ గతంలోనే ప్రకటించినప్పటికీ, ఆమెపై వేటు తప్పలేదు.

## అక్టోబర్ నెలలోనే స్థానిక ఎన్నికలు, కొత్త పింఛన్లు: నారా లోకేశ్

మొదటి పేజీ తరువాయి)

పరిష్కరిస్తూ, పారదర్శకంగా అర్హులకు లబ్ధి చేకూర్చాలని మంత్రులకు సూచించారు.స్థానిక సంస్థల ఎన్నికలను ఎట్టి పరిస్థితుల్లోనూ వాయిదా వేసే ప్రసక్తే లేదని, అక్టోబర్ నాటికే సమగ్ర ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని లోకేశ్ తేల్చి చెప్పారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న అంశాలను ప్రభుత్వం చట్టబద్ధంగా త్వరితగతిన పరిష్కరిస్తోందని తెలిపారు. మొదట పురపాలక (మున్సిపల్), ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ, చివరగా పంచాయతీ ఎన్నికలు క్రమపద్ధతిలో జరుగుతాయని వెల్లడించారు. స్థానిక ఎన్నికలను వాయిదా వేయించి, కేంద్ర ఫైనాన్స్ కమిషన్ నిధులు నిలిచిపోయేలా చేసి రాష్ట్రానికి నష్టం చేకూర్చాలనే లక్ష్యంతో వైసీపీ ఆడుతున్న 'గొడ్డలి రాజకీయాల' కుయుక్తులు ఎంతమాత్రం సాగవని మండిపడ్డారు. అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థుల భారీ విజయమే లక్ష్యంగా నాయకులు పనిచేయాలని పిలుపునిచ్చారు. మరోవైపు విద్య, సంక్షేమ, వైద్య శాఖలను లక్ష్యంగా చేసుకుని ప్రత్యర్థులు పన్నుతున్న కుట్రలు, సోషల్ మీడియా ట్రోలింగ్‌ల పట్ల మంత్రులు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని లోకేశ్ హెచ్చరించారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ప్రవర్తించే, మాట వినని అధికారులపై కఠినంగా వ్యవహరిస్తూ ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే, సెప్టెంబర్ 9తో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడిపై అక్రమ కేసులు బనాయించి అన్యాయంగా నిర్బంధించి మూడేళ్లు పూర్తవుతున్న సందర్భంగా... ఆనాటి కక్షసాధింపు చర్యల నుంచి రాష్ట్రం సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించేలా ప్రత్యేక కార్యక్రమానికి రూపకల్పన చేయాలని నిర్ణయించారు. ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే నీటి కొరతను ముందస్తు పొదుపు చర్యలతో అధిగమించాలని మంత్రులకు సూచించారు.

## కొండా సురేఖ సంచలన ఆరోపణలు చేశారు

మొదటి పేజీ తరువాయి)

అడగకుండా సీఎస్‌తో గవర్నర్‌కు లేఖ పంపించారు. ఆ లేఖకు లెటర్‌హెడ్ లేదు, సంతకం కూడా లేదు" అంటూ ఆమె ప్రశ్నించారు."ఎవరిపైనా లేని చర్యలు నాపైనే ఎందుకు తీసుకున్నారు?" అని కొండా సురేఖ నిలదీశారు. కొండా సురేఖ చేసిన ఈ ఆరోపణలు తెలంగాణ కాంగ్రెస్‌లో మరోసారి రాజకీయ దుమారం రేపుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఆమె చేసిన తీవ్ర వ్యాఖ్యలపై కాంగ్రెస్ వర్గాల్లో చర్చ మొదలైంది.

## మోదీని అడిగే దమ్ముందా?.. తెలంగాణ బీజేపీ నేతలకు పొన్నం సవాల్

మొదటి పేజీ తరువాయి)

ప్రభాకర్ ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే హైదరాబాద్‌లో కూర్చొని రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడం కాకుండా ఢిల్లీకి వెళ్లి ప్రధాని నరేంద్ర మోదీని నిలదీయాలని సవాల్ చేశారు.తెలంగాణకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, అనుమతులపై బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడటం లేదని పొన్నం ప్రశ్నించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన బాధ్యత తెలంగాణ బీజేపీ నేతలపై ఉందన్నారు. తెలంగాణ ప్రజల కోసం పోరాడే దమ్ము చూపించాలని సూచించారు.బీజేపీ పాలిత రాష్ట్రాలకు కేంద్రం నుంచి నిధులు, ప్రాజెక్టులు మంజూరవుతున్న తీరును తెలంగాణ విషయంలో ఎందుకు అమలు చేయడం లేదో ఆ పార్టీ నేతలు సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తేనే రాజకీయ ఉనికి కాపాడుకోవచ్చని భావించడం సరికాదన్నారు. ప్రతిపక్షంగా నిర్మాణాత్మకంగా వ్యవహరించి రాష్ట్ర హక్కుల కోసం కేంద్రాన్ని ప్రశ్నించాలని సూచించారు.గతంలో పదేళ్ల పాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీఆర్ఎస్ ప్రభుత్వం అనేక బకాయిలు పెట్టినప్పుడు బీజేపీ నేతలు ఎందుకు ప్రశ్నించలేదని పొన్నం నిలదీశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికప్పుడు చెల్లింపులు చేస్తూ పాత బకాయిలను కూడా పరిష్కరించే దిశగా ముందుకు వెళ్తోందన్నారు. తెలంగాణకు సంబంధించిన అనేక హామీలు, నిధులు, ప్రాజెక్టులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని మంత్రి ఆరోపించారు. రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన పన్నుల వాటా కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రాన్ని డిమాండ్ చేస్తోందన్నారు. తెలంగాణకు పెండింగ్‌లో ఉన్న మెట్రో రైల్, నవోదయ విద్యాలయాలు, కేంద్ర పాఠశాలలు, రీజినల్ రింగ్ రోడ్ తదితర ప్రాజెక్టులకు వెంటనే అనుమతులు, నిధులు మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం తెలంగాణ బీజేపీ నేతలు ఢిల్లీకి వెళ్లి ప్రధాని మోదీని కలిసి నిధులు, ప్రాజెక్టులపై స్పష్టమైన హామీ తీసుకురావాలని పొన్నం ప్రభాకర్ సూచించారు.


## మద్రాస్ హైకోర్టులో స్టాలిన్‌కు ఎదురుదెబ్బ

మొదటి పేజీ తరువాయి)

కొట్టివేసింది.వివరాల్లోకి వెళితే... కొలత్తూర్ శాసనసభ నియోజకవర్గంలో టీవీకే అభ్యర్థి వి.ఎస్. బాబు చేతిలో 8,795 ఓట్ల తేడాతో స్టాలిన్ పరాజయం పాలయ్యారు. అయితే ఈవీఎంలు, వీవీపాట్‌లలో అక్రమాలు జరిగాయని, కొన్ని యంత్రాలు అభ్యర్థి పేరును కూడా గుర్తించడంలో విఫలమయ్యాయని ఆరోపిస్తూ స్టాలిన్ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. 100 శాతం వివిపాట్ స్లిప్పులను లెక్కించి, తనను విజేతగా ప్రకటించాలని కోర్టును కోరారు. అయితే కేంద్ర ఎన్నికల సంఘం తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాదులు.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 329(ఎ), ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 ప్రకారం ఎన్నికల ఫలితాలను కేవలం 'ఎలక్షన్ పిటిషన్' ద్వారా మాత్రమే సవాలు చేయాల్సి ఉంటుందని, సాధారణ రిట్ పిటిషన్ ద్వారా కాదని స్పష్టం చేశారు. ఈ వాదనలతో ఏకీభవించిన మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్.ఎ. ధర్మాధికారి, జస్టిస్ జి. అరుళ్ మురుగన్‌లతో కూడిన ధర్మాసనం స్టాలిన్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను కొట్టివేస్తూ తుది తీర్పు వెలువరించింది.

# రైతు సమస్యలపై బి ఆర్ ఎస్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం





**తిప్పర్తి సెప్టెంబర్ 3 విజయకేరటం ప్రతినిధి**

తిప్పర్తి మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయం ముందు టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, తిప్పర్తి మాజీ జెడ్పిటిసి చందన ఫౌండేషన్ చైర్మన్ తండు సైదులు గౌడ్, టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఫల్ రెడ్డి రవీందర్ రెడ్డి, జిల్లా నాయకులు కందుల లక్ష్మయ్య, తో కలిసి కాంగ్రెస్ రేవంత్ రెడ్డి 1000 రోజుల పరిపాలన మరియు 420 హామీలపై రైతు సమస్యలపై బిఆర్ఎస్ నిరసన ఆందోళన నిర్వహించారు ఎమ్మటే సాగునీరు తాగునీరు అందించకుండా సోమవారం నాడు నార్కట్పల్లి అద్దంకి హైవే ను ముట్టడిస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ సీనియర్ నాయకులు వనపర్తి నాగేశ్వరరావు, ఎల్లమ్మ గూడెం మాజీ ఎంపిటిసి ఊట్కూరి సందీప్ రెడ్డి, సర్వారం సర్పంచ్ తగుళ్ల శ్రీను, కాశి వారి గూడెం సర్పంచ్ ఎస్.కె కమల్, మామిడాల మాజీ సర్పంచ్ మొకిరాల కృష్ణ, వనపర్తి జ్యోతి, కొండ్రాస్వరూప, జాల సాయిలు, మాతంగి జానయ్య, దొమ్మటి శ్రీనివాస్, గుండెబోయిన సైదులు జీడిపల్లి జీవన్ రెడ్డి పోలగోని సతీష్ గౌడ్ సంతు గౌడ్ , పలు గ్రామాల గ్రామ కార్యదర్శులు, మాజీ ప్రజా ప్రతినిధులు టిఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రజాపాలనకు ప్రజలే బలం






## సంక్షేమ పథకాలే మా ఆయుధాలు: ఎమ్మెల్యే రేవూరి

**వరంగల్ విజయ కెరటం సెప్టెంబర్ 3:**

కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా పరకాల పట్టణంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు సాగిన ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. రైతులకు రూ. 2 లక్షల వరకు రుణమాఫీ, రైతు భరోసా కింద రూ. 36 వేల కోట్లకు పైగా సాయం, రూ. 500కే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్లు, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. పరకాల పట్టణానికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు మంచినీరు, రహదారులు, మురుగు కాలువల అభివృద్ధితో పాటు విద్యా కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నామని అన్నారు.

# దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు సభ్యుల ముఠా అరెస్ట్ రిమాండ్

**విజయ కెరటం ప్రతినిధి :**

నల్గొండ పట్టణంలో ఆవారాగా తిరుగుతూ చెడు వ్యాసనాలకి అలవాలు పడి, జల్సాల కోసం దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు సభ్యుల ముఠాను నల్గొండ వన్ టౌన్ పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం

ముఠా వివరాలు (నిందితులు):

A1: నదీమ్ తండ్రి ఇబ్రహీం, వయస్సు 25 సం. లు, కులం ముస్లిం, నివాసం: పంజేష, నల్గొండ పట్టణం A2: షేక్ రిజ్వాన్ తండ్రి సలీం, వయస్సు: 26 సం,, కులం: ముస్లిం, వృత్తి: ప్రైవేట్ ఎంప్లాయ్ బజాజ్ ఎలక్ట్రానిక్స్, నివాసం ఇంటి నెం 3-9-91, ఘడి మస్జిద్, నల్గొండ పట్టణం A3: మహమ్మద్ అబ్దుల్ సమీర్ తండ్రి షకీల్, వయస్సు 23 సం,, కులం: ముస్లిం, వృత్తి: ఎలెక్ట్రికల్ వర్క్, నివాసం జామా మస్జిద్, నల్గొండ పట్టణం ప్రస్తుత నివాసం హౌసింగ్ బోర్డు కాలనీ, నల్గొండ పట్టణం.లి(ముగ్గురు గతం లో నేరాలు చేసి, జైలుకు వెళ్లిన చరిత్ర ఉంది) రికవరీ చేసిన సొత్తు: 1) 30 తులాల వెండి ఆభరణాలు 2) 4 గ్యాస్.సిలిండర్లు

3) 3 బ్యాటరీలు

4) 4 సెల్ ఫోన్లు

5) ?14,500 నగదు

కేసు పూర్వాపరాలు:

నల్గొండ పట్టణం లో ఓల్డ్ సిటీ ఏరియా లో ని వివిద కాలనిలకి చెందిన నిందితులు విలాసవంతమైన జీవితానికి అలవాటుపడి, ముఠా గా ఏర్పడి, నల్గొండ పట్టణంలోని పలు ప్రాంతాలలో తాళం వేసిన ఇళ్ళని లక్ష్యంగా చేసుకుని , నల్గొండ పాతబస్తీ ఏరియాలో ఇళ్ల తాళాలు పగలగొట్టి గత రెండు నెలలుగా దొంగతనాలకు పాల్పడుతోంది. నమ్మదగిన సమాచారం మేరకు వన్ టౌన్ పోలీసులు వీరిని అదుపులోకి తీసుకుని విచారించగా, మొత్తం (05) దొంగతనం నేరాలకు పాల్పడినట్లు నిందితులు అంగీకరించారు. దీంతో వారిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు పంపారు. నల్గొండ డీఎస్పీ శ్రీ కె శివరాం రెడ్డి ఆదేశానుసారం, చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్న వన్ టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐలు సైదులు, వెంకట్ నారాయణలతో పాటు సిబ్బంది రబ్బానీ, సాగర్ల శంకర్, అంజద్,కిరణ్, అంజయ్యలను జిల్లా ఎస్పీ శ్రీ శరత్ చంద్ర పవార్, ఘూ అభినందించారు.




# రెడ్ల నిరసన దీక్షను విజయవంతం చేయాలి.

## రెడ్డి సంఘాల ఐక్యవేదిక
## స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కరుణాకర్ రెడ్డి పిలుపు.

**నిజామాబాద్ సెప్టెంబర్ 3 (విజయ కెరటం )**



కార్పొరేషన్ కు వెయ్యి కోట్ల నిధి తో పాటు వెంటనే పాలకవర్గం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 8వ తేదీన రెడ్ల నిరసన దీక్ష చేపట్టనున్నట్లు కరుణాకర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం నిరసన దీక్షకు సంబంధించిన పోస్టర్ ను ఆవిష్కరించారు. వేలాదిమందితో...ఇందిరాపార్క్ హైదరాబాద్ లో జరుగబోయే " రెడ్ల నిరసన దీక్ష " కు ప్రతి రెడ్డి కుటుంబం నుండి పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా రెడ్డి సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లవెల్లి కరుణాకర్ రెడ్డి మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం మాటిచ్చి మరచి పోయిన రాష్ట్ర ప్రభుత్వానికి మరోసారి గుర్తు చేయడానికే ఈ దీక్ష చేపట్టినట్లు వెల్లడించారు. స్వాతంత్రం వచ్చి ఇప్పటివరకు కూడా పేరుకు రెడ్డి ముఖ్యమంత్రి ఉన్నంత మాత్రాన మా సామాజిక వర్గానికి కావచ్చు, అగ్రవర్ణ పేదలకు కావచ్చు ఒరిగిందేమీ లేదని ఆవేదన వ్యక్తం చేశారు.మా సామాజిక వర్గంలోని పేద రెడ్లకు కావచ్చు, అగ్రవర్ణాల పేదల కావచ్చు న్యాయం జరగాలంటే రెడ్డి సామాజిక వర్గం ముఖ్యమంత్రి కాకుండా బీసీ సామాజిక వర్గానికి చెందినవారు ఎస్సి సామాజిక వర్గానికి చెందిన వారు కావచ్చు ముఖ్యమంత్రిగా చేయాలని మేము ఈ సందర్భంగా మా అభిప్రాయాన్ని వ్యక్తపరుస్తున్నామన్నారు. ఈ మార్పు వల్ల మా పేద రెడ్లకు, అగ్రవర్ణ పేదలకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.రెడ్డి కార్పొరేషన్ తో పాటు రైతు భీమా పథకం కొనసాగించాలని డిమాండ్ చేశారు.. ఈ డబ్ల్యూ ఎస్ పదిశాతం రిజర్వేషన్ ను అన్ని ప్రభుత్వ విభాగాల్లో పూర్తి స్థాయిలో అమలు చేయాలని, మన... మన పిల్లల భవిష్యత్ కోసమే చేస్తున్న దీక్ష కు మీ యొక్క జిల్లాలోని ప్రతి గ్రామంలో ఉన్న ప్రతి రెడ్డి కుటుంబం నుండి ఒకరు రావాలని కోరుతున్నామన్నారు.ఈ కార్యక్రమంలో గాదరీ సంజీవరెడ్డి, సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి, రమేష్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి పాల్గొన్నారు.

# సరైన ధ్రువీకరణ పత్రాలు- ఓటర్ల జాబితాలో పేర్లను నమోదు చేయాలి

## జిల్లా కలెక్టర్ తేజస్ పవార్

**సూర్యాపేట (విజయ కెరటం స్టేట్ బ్యూరో గౌస్)**



ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న వారిలో సరైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించిన వారి పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. గురువారం పెనపహాడ్ మండల పరిధిలోని అనంతారం గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమగ్ర ఓటర్ సవరణ ప్రక్రియ(సార్) లో భాగంగా ఎన్యుమరేషన్‌లో మ్యాపింగ్‌కాని ఓటర్లతోపాటు వివరాలు తప్పుగా ఉన్న ఓటర్లకు సక్రమంగా నోటీసులు అందుతున్నాయా? లేదా? అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నోటీసులు అందుకున్న వారు సరైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించినప్పుడే వారిని ఓటర్ లిస్టులో చేర్చాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజశేఖర్ రెడ్డి, ఆర్ ఐ రంజిత్ రెడ్డి, బి ఎల్ వో లు, సర్పంచ్ శోభ శ్రీనివాస్, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సీషెల్స్ బృందంతో రవిచంద్ర భేటీ



## రాధాకృష్ణన్‌తో కలిసి కీలక సమావేశం


**వరంగల్ విజయ కెరటం సెప్టెంబర్ 3:**

భారత్ పర్యటనలో ఉన్న సీషెల్స్ పార్లమెంటరీ ప్రతినిధి బృందం ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ సీ.పీ. రాధాకృష్ణన్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిసింది. ఉపరాష్ట్రపతి ఆహ్వానం మేరకు బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత వద్దిరాజు రవిచంద్ర ఈ సమావేశంలో పాల్గొన్నారు.సీషెల్స్ జాతీయ అసెంబ్లీ స్పీకర్ అజారెల్ ఎర్నెస్టా నేతృత్వంలోని ప్రతినిధి బృందం భారత పర్యటనలో భాగంగా పార్లమెంటును సందర్శించింది. ఈ సందర్భంగా భారత్--సీషెల్స్ మధ్య స్నేహపూర్వక సంబంధాలు, పార్లమెంటరీ సహకారంపై చర్చించారు. అనంతరం ఉపరాష్ట్రపతి సీషెల్స్ ప్రతినిధి బృందానికి తేనీటి విందు ఏర్పాటు చేసి జ్ఞాపికలను అందజేశారు. ఈ సమావేశంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పాల్గొన్నారు.



విజయకెరటం
తెలుగు దినపత్రిక

## ఫ్లెక్సీ ప్రింటింగ్ షాపుల యజమానులకు మున్సిపల్ కమిషనర్ బి. వంశీకృష్ణ హెచ్చరిక



**విజయ కెరటం ప్రతినిధి :**

నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అనుమతి లేకుండా ఫ్లెక్సీలను ముద్రించడం, ఏర్పాటు చేయడంపై కఠిన˘ర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ బి. వంశీకృష్ణ హెచ్చరిం చారు. ఫ్లెక్సీ ప్రింటింగ్ షాపుల యజమానులతో కమిషనర్ ఛాంబర్లో నిర్వహించిన సమావేశం లో ఆయన మాట్లాడారు. మున్సి పల్ కార్పొరేషన్ అనుమతి పత్రాన్ని పరిశీలించిన తర్వాతే ఫ్లెక్సీలను ముద్రించాలని సూచించారు. రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, వ్యక్తులు లేదా ఇతర సంస్థల నుంచి ఆర్డర్లు వచ్చినా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. కార్పొరేషన్ అనుమతి పొందిన హోర్డింగ్స్, మీడియన్లలో అనుమతితో ఏర్పాటు చేసిన లాలీపాప్ బోర్డులకు మాత్రమే ఫ్లెక్సీలు ముద్రించాలని తెలిపారు. అనుమతి లేని ఫ్లెక్సీలను జంక్షన్లు, మీడియన్ పోల్స్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేయకూడదన్నారు. ముఖ్యంగా కూడళ్ల వద్ద ఏర్పాటు చేస్తున్న రౌండ్ ఫ్లెక్సీల కారణంగా వాహనదారులకు దృశ్యమానత తగ్గి ప్రమాదాలకు అవకాశం ఏర్పడుతోందని కమిషనర్ పేర్కొన్నారు. రహదారి భద్రతకు విఘాతం కలిగించే ప్రకటనలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. అనుమతి లేకుండా ఫ్లెక్సీ ఏర్పాటు చేసినా.. అనుమతి లేని ఫ్లెక్సీని ముద్రించినా సంబంధిత ఫ్లెక్సీ యజమానులపై చర్యలు తీసుకుంటామని అన్నారు

## అధికారిక కార్యక్రమాలు, ప్రారంభోత్సవ ప్రకటనల్లో మంత్రుల ఫొటోలు లేకపోవడం సరికాదు: చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి)

రామానాయుడు ఫొటోను ముద్రించకపోవడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. భవిష్యత్తులో ఇలాంటి తప్పులు పునరావృతం కాకుండా కఠిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇదే సమయంలో, అత్యంత సంక్లిష్టమైన వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవ పనులను సమర్థవంతంగా పూర్తి చేసిన జలవనరుల శాఖ, ఆర్థిక శాఖ అధికారుల సమన్వయాన్ని సీఎం అభినందించారు. మంత్రి నిమ్మల రామానాయుడు నిత్యం ప్రాజెక్టుల వద్దే ఉంటూ, ఎంతో నిరాడంబరతతో పనిచేస్తూ ఫలితాలు సాధిస్తున్నారని చంద్రబాబు కొనియాడారు. రాష్ట్ర ఆర్థిక వృద్ధిని వేగవంతం చేసేందుకు దుగరాజపట్నం వద్ద షిప్ బిల్డింగ్ యూనిట్ ఏర్పాటవుతోందని చెప్పారు. ఆంధ్ర పాప్‌కార్న్, అరకు కాఫీ ఉత్పత్తులను రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి విస్తృతంగా తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో తీవ్రరూపం దాలుస్తున్న ఎల్‌నినో పరిణామాలపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. గడిచిన 30 ఏళ్లలో ఎప్పుడూ లేని విధంగా అత్యంత స్వల్ప వర్షపాతం నమోదైందని, ముఖ్యంగా అన్నమయ్య జిల్లాలో 76 శాతం, ప్రకాశం జిల్లాలో 70 శాతం మేర తీవ్ర వర్షపాత లోటు ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులపై ఈరోజే కేంద్ర ప్రభుత్వానికి నివేదిక రూపంలో లేఖ రాయనున్నట్లు వెల్లడించారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఒక్క ఎకరా పంట కూడా ఎండిపోకూడదని, భూగర్భ జలాల ఆధారంగా అవసరమైతే అదనపు బోర్లు వేసేందుకు తక్షణ అనుమతులు ఇవ్వాలని ఆన్నారు.


## దీపికను వెనక్కి నెట్టి.. దేశంలోనే నంబర్ 1 హీరోయిన్‌గా నిలిచిన రష్మిక మందన్న




భారత చలనచిత్ర పరిశ్రమలో సరికొత్త అధ్యాయం మొదలైంది. కన్నడ చిత్రసీమ నుంచి ప్రయాణం మొదలుపెట్టి పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగిన రష్మిక మందన్న, తాజాగా దేశంలోనే నంబర్ 1 హీరోయిన్‌గా నిలిచారు. ఇటీవల వెలువడిన జాతీయ స్థాయి పాప్యులారిటీ ర్యాంకింగ్‌లో, బాలీవుడ్ అగ్ర కథానాయిక దీపిక పదుకొణెను వెనక్కి నెట్టి రష్మిక ఈ ఘనత సాధించినట్లు తెలుస్తోంది. ఇది ఆమె కెరీర్‌లో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తోంది. 'పుష్ప: ది రైజ్' చిత్రంలో ఆమె పోషించిన శ్రీవల్లి పాత్ర దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించి, ఆమెకు పాన్ ఇండియా స్థాయిలో భారీ బ్రేక్ ఇచ్చింది. ఆ తర్వాత వచ్చిన 'యానిమల్' సినిమాతో హిందీ ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యారు. ఇటీవల విడుదలైన 'పుష్ప 2: ది రూల్' ఆమె మాస్ ఇమేజ్‌ను, క్రేజ్‌ను శిఖర స్థాయికి చేర్చింది. దీంతో పాటు 'ఛావా', 'కుబేర' వంటి విభిన్న భాషల చిత్రాలతో తన నటనను, ఉనికిని అన్ని పరిశ్రమలలోనూ బలంగా చాటుకున్నారు. రష్మిక విజయం కేవలం గత చిత్రాలకే పరిమితం కాలేదు. భవిష్యత్తులోనూ ఆమె డైరీ అగ్రశ్రేణి ప్రాజెక్టులతో నిండిపోయింది. రాబోయే అక్టోబర్ 16న విజయ్ దేవరకొండతో కలిసి నటిస్తున్న 'రణబాలి' విడుదల కానుండగా, నవంబర్ 27న 'మైసా' ప్రేక్షకుల ముందుకు రానుంది. వీటితో పాటు 'రాకా', 'పుష్ప 3', 'యానిమల్ పార్క్' వంటి భారీ బడ్జెట్ చిత్రాలు కూడా ఆమె ఖాతాలో ఉన్నాయి. ఈ ప్రాజెక్టులన్నీ ఆమెను దేశంలోనే అత్యంత బిజీగా ఉన్న నటీమణులలో ఒకరిగా నిలబెట్టాయి. రష్మిక అగ్రస్థానానికి చేరడం అనేది భారతీయ సినిమాలో మారుతున్న సమీకరణాలకు నిదర్శనం. ప్రాంతీయ భాషా చిత్రాల సరిహద్దులు చెరిగిపోయి, ప్రతిభ ఉన్న నటీనటులకు దేశవ్యాప్తంగా ఆదరణ లభిస్తోందనడానికి ఆమె విజయమే ఒక ఉదాహరణ. దీపిక పదుకొణె ఇప్పటికీ ఒక ఐకాన్‌గా కొనసాగుతున్నప్పటికీ, పలు భాషల్లో వరుస విజయాలు సాధించి, పాన్ ఇండియా స్టార్‌డమ్‌కు కొత్త నమూనాను సృష్టించారు రష్మిక. ఆమె ప్రయాణం ఆధునిక స్టార్‌డమ్ భాషకు అతీతమని స్పష్టం చేస్తోంది.

# ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో సూర్యాపేట టౌన్ ప్లానింగ్ అధికారి సోమయ్య



**సూర్యాపేట, సెప్టెంబర్ 3: విజయ్ కెరటం ప్రతినిధి**

ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలపై సూర్యాపేట మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారి వి. సోమయ్యపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కేసు నమోదు చేసింది. నల్గొండ రేంజ్ ఏసీబీ అధికారులు గురువారం సోమయ్య నివాసం, కార్యాలయంతో పాటు ఆయన బంధువులు, సహచరులకు సంబంధించిన మరో ఏడు ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ మేరకు ఏసీబీ అధికారికంగా వివరాలు వెల్లడించింది. సోదాల్లో పలు ఆస్తులకు సంబంధించిన కీలక పత్రాలను ఏసీబీ అధికారులు గుర్తించారు. ఇందులో సూర్యాపేట జిల్లాలో 3 ఎకరాల 3 గుంటల వ్యవసాయ భూమి, సూర్యాపేట, హయత్‌నగర్ పరిధిలో ఐదు నివాస ఆస్తులు ఉన్నట్లు గుర్తించారు. వీటిలో ఒక జీ౦1 భవనం, ఒక జీ౦2 భవనం, ఒక జీ౦4 భవనం, ఒక పెంట్‌హౌస్, రెండు గ్రౌండ్‌ఫ్లోర్ ఇళ్లు ఉన్నాయి. అలాగే సూర్యాపేట పరిధిలో ఎనిమిది ఓపెన్ ప్లాట్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. గుర్తించిన ఆస్తుల మార్కెట్ విలువ అధికారిక విలువ కంటే చాలా ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఏసీబీ పేర్కొంది.

### బంగారం 709 గ్రాములు.. వెండి 1,750 గ్రాములు

సోదాల్లో రూ.4,63,990 నగదు, బ్యాంకు ఖాతాల్లో రూ.13 లక్షల నిల్వలు గుర్తించారు. అదేవిధంగా 709 గ్రాముల బంగారు ఆభరణాలు, 1,750 గ్రాముల వెండి ఆభరణాలు లభించాయి. వీటి విలువ సుమారు రూ.20 లక్షలుగా అంచనా వేశారు. సోమయ్యకు చెందిన రెండు నాలుగు చక్రాల వాహనాలు, మూడు ద్విచక్ర వాహనాలు కూడా గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.25.20 లక్షలుగా అధికారులు పేర్కొన్నారు. ఇంట్లోని గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువుల విలువ సుమారు రూ.11 లక్షలుగా అంచనా వేశారు. రూ.49 లక్షల గోల్డ్ లోన్ బంగారాన్ని తాకట్టు పెట్టి బ్యాంకు ద్వారా సుమారు రూ.49 లక్షల రుణం పొందినట్లు ఏసీబీ గుర్తించింది. మరిన్ని ఆస్తుల వివరాలపై విచారణ కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. రూ.3.54 కోట్లుగా ఆస్తుల అంచనా ఇప్పటివరకు గుర్తించిన ఆస్తులు, నగదు, బంగారం, వాహనాలు తదితరాలను కలిపి సోమయ్యకు సంబంధించిన ఆస్తుల మొత్తం విలువను రూ.3,54,36,490గా ఏసీబీ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఆదాయ వనరులతో పోలిస్తే ఆస్తుల విలువపై ఏసీబీ అధికారులు మరింత దర్యాప్తు చేస్తున్నారు. అనంతరం సోమయ్యను హైదరాబాద్‌లోని ప్రత్యేక ఏసీబీ కోర్టు ఎదుట హాజరుపరిచి న్యాయ రిమాండ్‌కు తరలించనున్నట్లు ఏసీబీ వెల్లడించింది. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.




## 'యేషనాగుల' దుమ్మురేపుతోంది.. యూట్యూబ్‌లో అదిరిపోయే రికార్డు!

**'యేషనాగుల'కు ఐదు రోజుల్లో 50 మిలియన్ వ్యూస్**

**అత్యంత వేగంగా ఈ మైలురాయి చేరిన తెలుగు పాటగా రికార్డు**

**యూట్యూబ్ గ్లోబల్ చార్టుల్లో నంబర్ వన్ ట్రెండింగ్**

**సోషల్ మీడియాలోనూ పాటకు భారీ స్పందన**

**పాటలో కనిపించిన నాని, కీర్తి సురేశ్**

నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ది ప్యారడైజ్' సినిమాపై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. తాజాగా ఈ చిత్రంలోని రెండో పాట 'యేషనాగుల' మరో సంచలనం సృష్టించింది. విడుదలైన ఐదు రోజుల్లోనే 50 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించిన తొలి తెలుగు పాటగా రికార్డు సృష్టించిందని చిత్రబృందం ప్రకటించింది. 'యేషనాగుల' పాట ఆగస్టు 29న విడుదలైంది. తెలంగాణ జానపద బాణీకి ఆధునిక టచ్ జోడించిన ఈ పాటకు మంచి స్పందన వస్తోంది. పాట విడుదలైన కొద్దిరోజుల్లోనే యూట్యూబ్‌తో పాటు సోషల్ మీడియాలోనూ ట్రెండ్‌గా మారింది. నాని, కీర్తి సురేశ్ కనిపించే ఈ పాటకు అభిమానులు భారీగా స్పందిస్తున్నారు. గ్లోబల్ చార్టుల్లోనూ దూకుడు 'యేషనాగుల' యూట్యూబ్ గ్లోబల్ చార్టుల్లో నంబర్ వన్ ట్రెండింగ్‌లో ఉందని 'ది ప్యారడైజ్' అధికారిక ఖాతా వెల్లడించింది. ఐదు రోజుల్లో 50 మిలియన్ల మార్క్‌ను దాటడం విశేషంగా మారింది. సోషల్ మీడియాలో ఈ పాటకు సంబంధించిన రీల్స్, డ్యాన్స్ వీడియోలు కూడా వైరల్ అవుతున్నాయి. పాటకు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించారు. కాసర్ల శ్యామ్ సాహిత్యం రాశారు. ప్రభా బంగారిగల్ల, అడ్డుల జంగిరెడ్డి పాడారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న 'ది ప్యారడైజ్'లో నాని కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ పాట విడుదల సమయంలో అనిరుధ్ రవిచందర్ డల్లాస్ కచేరీలో నాని వేదికపైకి వచ్చి సందడి చేయడం కూడా అభిమానుల్లో ఆసక్తిని పెంచింది.

Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.), Editor: MAKSOOD AHAMED MOHAMED Cell: 9908408528